క్లుప్తంగా

అన్నసమారాధన



గుడివాడ టౌన్ : స్థానిక దనియాల పేటలోని ప్రణవాశ్రమంలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా ఈ అన్నసమారాధన నిర్వహించినట్లు ప్రణవాశ్రమ పీఠాధిపతులు స్థైర్యానంద సరస్వతి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ప్రణవాశ్రమ మేనేజర్ ఆర్. వేణుబాబు, కె. రవీందర్, ఆర్. మురళీధర్, ఎంవీ శేఖర్, వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్ద డ్రెయినేజీ లేక అవస్థలు



మండవల్లి: మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక అక్కడకు వెళ్లే రోగులు పలు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా పీహెచ్‌సీ ప్రాంగణంలో వర్షం నీరు నిలిచిపోతుంది. డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో ఎగువ నుంచి వస్తున్న నీరు డ్రెయిన్ ద్వారా బయటకు పోవడం లేదు. ఈ కారణంగా ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వారికి వచ్చిన రోగాలకు తోడు దగ్గు, జలుబు వంటి కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు.

తూటికాడ కషాయం తయారీ



మండవల్లి: అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుడిదోమ నివారణకు ఆదివారం తూటికాడ కషాయం తయారు చేశారు. కషాయాన్ని ఏ విధంగా వాడాలి, ఎంత మోతాదులో వాడుకోవాలి వంటి విషయాలను విశదీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయ రైతుల అనుభవాలను మిగిలిన రైతులకు తెలియజేశారు. తక్కువ ఖర్చుతో పురుగులను నివారించడానికి సహజ సిద్ధంగా ఏ విధంగా కషాయాలు తయారు చేసుకోవాలి వాటి ఉపయోగాలను ఎన్ఎఫ్ఏ మధు రైతులకు వివరించారు.

విద్యాబోధనలో మెలకువలు పాటించాలి



పామర్రు: ఉపాధ్యాయులు విద్యాబోధనలో మెలకువలను పాటిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని అంగలూరు డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టరు పి.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రగతి విద్యాసంస్థలు మెగా డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వినయ్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన చేయాలన్నారు. ప్రమాణాలను పాటించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్లు రాయన శివరామ ప్రసాద్, కె.షర్మిల, కె.భవాని, విశ్వనాథ పల్లి నాగరాజు పాల్గొన్నారు.

విద్యావికాస్ డైరెక్టర్‌కు సత్కారం



గుడివాడ టౌన్ : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, హెచ్ఎం సీహెచ్ నాగమల్లేశ్వరరావును ఆదివారం ఘనంగా సత్కరించారు. శనివారం పామర్రు ఏఎస్ఎం స్కూల్లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ సత్కారం చేశారని సాంబశివరావు తెలిపారు.

డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తం

కలిదిండిలో చిన్నపాటి వర్షానికే రోడ్ల మునక



కలిదిండి-కైకలూరు రోడ్‌లో డ్రెయిన్‌లో పేరుకుపోయిన ఖాళీ సీసాలు, చెత్త



కలిదిండి బస్టాండ్ సమీపంలో మురికిగుంట

కలిదిండి(కైకలూరు): కలిదిండిలో ఎక్కడ చూసినా కంపుగొడుతోంది. దీనికి ప్రధాన కారణం డ్రెయిన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడమే. దీర్ఘకాలిక సమస్యగా మారిన డ్రెయిన్ల వ్యవస్థను పునర్నిర్మించాలని కలిదిండి ప్రజలు కోరుతున్నారు. కలిదిండి ప్రధాన సెంటర్ నుంచి కైకలూరు వెళ్లే రహదారిలో డ్రెయిన్‌లో అక్కడక్కడా తూములు ఏర్పాటు చేసినా ఎగువ నుంచి నీరు కిందకు రావడం లేదు. పైగా ఈ రహదారిలో బ్రాందీ దుకాణం వద్ద తాగిపడేసిన ఖాళీ సీసాలతో డ్రెయిన్ నిండిపోయింది. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా డ్రెయిన్‌లో నిల్వ నీరు దర్శనమిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా నెలల తరబడి నీరు నిల్వ ఉండిపోయింది. బస్టాండ్ సమీప నాంది వాటర్ స్కీం వద్ద నీటి మడుగు కనిపిస్తోంది. కుమ్మరిగుంట, ఇందిరాకాలనీ, పేటకలిదిండిలో వర్షం కురిస్తే డ్రెయినేజీ నీరు రోడ్లపైకి చేరుతుంది.



కలిదిండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా పారని మురుగునీరు

తలసరి ఆదాయంలో ప్రథమ స్థానం

రాష్ట్రంలో కలిదిండి మండలం తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ ఆక్వా అధిక ఉత్పత్తుల వల్ల ఈ స్థానాన్ని అనేక సంవత్సరాలుగా ఈ మండలం పదిలం చేసుకుంటోంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పదేపదే సమావేశాల్లో గొప్పగా చెబుతున్నారు. అయితే కలిదిండిలో చిన్నపాటి వర్షానికి రోడ్లు మునిగిపోతున్నాయి. పంచాయతీలో పేరుకు అధికారులు ఉన్నప్పటికీ డ్రెయిన్ల నిర్మాణంలో చేతులెత్తేశారు. పంచాయతీ కార్యదర్శి ఆర్‌వీ.ఉదయ్‌కుమార్ కొన్ని నెలలుగా అనారోగ్యం బారినపడ్డారు. ఆరోగ్య రీత్యా అప్పుడప్పుడూ కార్యాలయానికి వస్తున్నారు. దీంతో మరింతగా పాలన దిగజారింది. కలిదిండి పంచాయతీ కార్యాలయం వెనక డంపింగ్‌యార్డు ఉంది. దీని సమీపంలోనే సచివాలయం నిర్మించారు. చెత్త కనిపించకుండా ప్రహరీ నిర్మించాలని అనేక మంది అడుగుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.



కలిదిండి కేడీసీసీ బ్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్త

శాశ్వత పరిష్కారం చూపండి

డ్రెయిన్ల వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే ప్రధాన సెంటర్లు నీట మునుగుతున్నాయి. రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నాం. ఇది కలిదిండిలో అందరి సమస్య. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపడానికి కృషి చేయాలి.

– షేక్ చాన్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్, కలిదిండి



సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

మండల ప్రధాన కేంద్రమైన కలిదిండిలో డ్రెయినేజీ సమస్య వాస్తవమే. ప్రజాప్రతినిధులతో సమస్యపై చర్చించాను. 100 మీటర్లలో మురుగునీరు ఇంకిపోయే మ్యాజిక్ డ్రెయిన్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం. ప్రస్తుత నేలలు దీనికి సహకరిస్తాయా లేదా అనే దానిపై అనుమానం వ్యక్తమవుతోంది.

– ఆర్.ఫణీంద్ర, ఎంపీడీఓ, కలిదిండి

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



పాల పొంగళ్లను పొంగిస్తున్న మహిళా భక్తులు



చైర్మన్ మోహన్‌కు ముక్కు పుడకను అందించిన దాతలు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. మహిళా భక్తులు పాల పొంగళ్లను పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు తాగునీరు తదితర కనీస సౌకర్యాలను కల్పించారు.

కొండలమ్మకు బంగారు ముక్కు పుడక సమర్పణ

గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ అమ్మవారికి గుడివాడకు చెందిన శ్రీ అంబిక జ్యుయలరీ అండ్ సిల్వర్ మెటీరియల్స్ దుకాణ యజమాని రాజు, సోని దంపతులు రూ.24వేల విలువ గల బంగారు ముక్కు పుడకను సమర్పించారు. ఆదివారం ఆ ముక్కు పుడకను దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావుకు అందించారు. అనంతరం దాతల కుటుంబాన్ని సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

వృద్ధురాలి కోసం గాలింపు చర్యలు

ముదినేపల్లి రూరల్: స్థానిక పోల్‌రాజ్ కాలువలో గల్లంతైన వృద్ధురాలి కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం మూడోరోజు ఆదివారం గాలింపు చర్యలు కొనసాగించింది. ముదినేపల్లికి చెందిన వీరంకి విమల ఈ నెల మూడో తేదీ తెల్లవారుజామున స్థానిక పోల్‌రాజ్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా మృతదేహం కోసం రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆదివారం సాయంత్రం వరకు మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు.

కొల్లేరు పక్షులను మిత్రులుగా భావించండి



కైకలూరు: ఆతిథ్యం కోసం లక్షల కిలోమీటర్ల నుంచి కొల్లేరు సరస్సుకు వలస వస్తున్న పక్షులను మిత్రులుగా భావించి సంరక్షించాలని రాష్ట్ర వడ్డీ సాధికారిత కో–కన్వీనర్ బలే ఏసురాజు అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా పందిరిపల్లిగూడెంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. కై కలూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామలింగాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసురాజు మాట్లాడారు. కొల్లేరు గ్రామాల్లో పక్షులను వేటాడితే రూ.లక్ష జరిమానా విధించాలని పెద్దలు నిర్ణయించారన్నారు. అటవీశాఖ సిబ్బందికి కొల్లేరు ప్రజలు సహకరించాలన్నారు. రేంజర్ రామలింగాచార్యులు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు జరుపుతున్నామన్నారు. డెప్యూటీ ఫారెస్టు రేంజర్ డి.రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలన్నారు. కొల్లేరులో నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. గ్రామ పెద్ద బలే సముద్రుడు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు రాంబాబు, రత్నరాజు, ఫారెస్టు బీటు ఆఫీసర్లు రాజ్‌కుమార్, వెంకన్న, నరసింహారాజు, రాజేష్, కృష్ణంరాజు, అసిస్టెంటు బీటు ఆఫీసర్లు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



గెట్ టు గెదర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీ శ్రీనివాసా రెసిడెన్సీలో గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ మురిసిపోయారు. అనంతరం అందరూ కలిసి ఆటపాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెమీల్, త్రివిక్రమ సాయిరాం, హైదర్, సిద్దిక్ పాషా, కేవీవీ లక్ష్మీ, పద్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సంఘం మండల అధ్యక్షుడిగా నాగరాజు

పమిడిముక్కల: మండలంలోని ముళ్లపూడి గ్రామానికి చెందిన బోయిన నాగరాజును అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం మండల శాఖ అధ్యక్షుడిగా నియమించారు. అయ్యప్ప భక్తుల సమస్యలు, సంఘ పటిష్టతకు పాటుపడతానని నాగరాజు తెలిపారు. తనను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు వాండ్రాసి పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు ఆలంబనగా నిలవాలి

కంకిపాడు: వృద్ధులకు ఆలంబనగా నిలవాలని వక్తలు సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీ రావి సురేష్‌బాబు పర్యవేక్షణలో ఈడుపుగల్లు కోదండ రామాలయంలో సేవ చేస్తున్న ఇద్దరు వృద్ధులకు దుస్తులు, నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా మాట్లాడుతూ వృద్ధులకు అవసరమైనచేయూత అందించాలని, వారికి అండగా నిలవాలని కోరారు. మొక్కల సంరక్షణ బాధ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, నాయకులు పందిపాటి సుధాకర్, షేక్ షకార్, విజయ్‌కుమార్, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం-ఐలూరు రోడ్డుకు మోక్షమెప్పుడో?

పమిడిముక్కల: మండలంలోని కృష్ణాపురం-ఐలూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు లేచి ప్రమాదకరంగా ఉంది. ఇసుక టిప్పర్లు అధిక లోడ్‌తో తిరగడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గుంతల్లో వాహనాలు దిగబడిపోతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కరకట్ట పైకి వెళ్లి విజయవాడ వెళ్లేందుకు దగ్గరి దారి కావడంతో ఈ రహదారిపై అధిక సంఖ్యలో వాహన రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన కృష్ణాపురం-ఐలూరు రోడ్డు

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు

పామర్రు: మండలంలోని కొమరవోలులో ఓ మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా సభ్యులు ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా సభ్యులు బి.కీర్తి, పి.రజని, డి.ఆదిలక్ష్మీ మాట్లాడారు. కొమరవోలులో నివాసం ఉంటున్న మేడపాటి వసంతను అదే గ్రామానికి చెందిన మేరుగుమాల పవన్ అనే వ్యక్తి నాలుగు నెలల నుంచి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ వేధింపులు భరించలేక ఈ నెల 4వ తేదీన ఆ మహిళ ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. వేధింపులకు కారణం అయిన పవన్‌ను వెంటనే అరెస్టు చేసి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

చినముత్తేవి(మొవ్వ): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కృషి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం మొవ్వ మండల కమిటీ సమావేశం ఆదివారం చినముత్తేవి గ్రామంలో అజయ్‌కుమార్ భవనంలో బొల్లా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరు శివ నాగేంద్రం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కౌలుదార్లుకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రొఫెసర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పండించే పంటలకు మద్దతు ధరను ప్రకటించటం లేదన్నారు. మరో పక్క కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేలా మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 15 నెలలుగా ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా సుమారు రూ.923 కోట్ల రూపాయలు ట్రూ డౌను పేరుతో తిరిగి ప్రజానీకానికి చెల్లించాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వానికి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి శ్రీనివాసరావు, రాంబాబు, సీహెచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళులు



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని కోమర్రు మాజీ సర్పంచ్ కొల్లి వెంకట సత్యనారాయణ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నివాళులర్పించారు. సత్యనారాయణ ఇటీవలనే మరణించగా స్థానిక ఆటోనగర్ కాలనీలోని నివాసంలో ఆదివారం సంస్మరణ కార్యక్రమం జరిగింది. పాల్గొన్న డీఎన్నార్ కుటుంబసభ్యులను పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, నాయకులు నీలం రామకృష్ణ, మోహనకుమార్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు అందించాలి...

ఆక్వా సాగులో నాణ్యమైన ఉత్పత్తులను అందించి రైతుల మన్ననలు పొందాలని డీఎన్నార్ అన్నారు. మండలంలోని వడాలిలో పార్టీ నాయకుడు అచ్యుత రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆక్వా ఫీడ్స్ అండ్ సీడ్స్ వ్యాపారాన్ని డీఎన్నార్ ప్రారంభించారు. నియోజకవర్గంలో అత్యంత విస్తీర్ణంలో ఆక్వా సాగు జరుగుతున్నందున రైతులకు మేలైన ఉత్పత్తులను అందించి వారి బాగోగులకు కృషి చేయడంతో పాటు వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూనపురెడ్డి సత్యనారాయణ, చంటిరాజు, కొండరాజు, రామకృష్ణంరాజు, ఆంజనేయరాజు, శీలం శ్రీనివాసరావు, బచ్చుల గోపి పాల్గొన్నారు.

538 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 538 మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, కంటి పరీక్షలకు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి చెందిన హెచ్.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ సేవలను రోగులకు అందించారు.

ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్ : రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ సరిత, డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో 80 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, పూర్వ అధ్యక్షుడు బి. శంకరరావు, జ్యోతేశ్వరరావు, చైతన్య పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

గుడివాడ టౌన్ : జనగణనలో కుల జనగణన చేపట్టి జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లను ఎ,బి, సి,డి లుగా వర్గీకరణ చేసిన తరువాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో బీసీలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. బీసీలు అధిక సంఖ్యాకులుగా ఉండి కొన్ని సామాజిక వర్గాలు రాజ్యాధికారానికి దూరమవుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే లోపు ఈ నిర్ణయాన్ని తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని వీరంకి, అమీనపురం, మేడూరు, ముదిరాజుపాలెం గ్రామాలకు సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. చోరగుడి, అలీనఖీపాలెం, పెనుమత్స, గోపాలకృష్ణాపురం గ్రామాలకు మంగళవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని తొమ్మిది గ్రామాలకు సోమవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఆదివారం విద్యుత్ ఈఈ జి.బి.శ్రీనివాసరరావు విలేకరులకు తెలిపారు. 33/11 కె.వి. కొతవరం సబ్ స్టేషన్‌లో 11 కె.వి. ఫీడర్ పరిధిలోని కౌతవరం, వడ్లమన్నాడు, వేమవరం, వేమవరప్పాలెం, రెడ్డిపాలెం, గాదేపూడి, ఉలవలపూడి, పద్మాలపాలెం, భీమునిగుంటలో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లను కొట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: విద్యుత్ లైన్లకు అడ్డువచ్చే చెట్ల తొలగించే క్రమంలో సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండబోదని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. వరాహపట్నం, అగ్రహారం గ్రామాల్లో గృహ, వాణిజ్య పరిశ్రమలు, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ముదినేపల్లి ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, చిన్నవాడవల్లి, వాడవల్లి గ్రామాల్లోని విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను తొలగిస్తున్నందున సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో రాణించిన వారే ఆదర్శం



పూర్ణచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పామర్రు: ఉపాధ్యాయ వృత్తిలో రాణించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా 30 ఏళ్లపైబడి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటున్న పూర్ణచంద్రారెడ్డిని, రాపర్లలో మదర్‌థెరిస్సా స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.పుష్పా యాకోబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అప్సా ఫైనాన్షియల్ సెక్రటరీ ఎండీ రఫీ, వీనాగప్రవీణ్ జిల్లా పీసీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com